అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

- ప్రభుత్వం మారితే ప్రజా ప్రతినిధులను మరచిపోతారా ?
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు: నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారులు ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. మండల విద్యాధికారి రామ్మూర్తి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన నిర్వాహకులు కొత్తవారు వచ్చినందున విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు నెల రోజులు సమయం పడుతుందని అంతవరకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. బడి బయటి పిల్లలను బడిలో చేర్పేందుకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమన్నారు. పెద్దకడబూరు సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ.. అధికారులకు అవసరమైనప్పుడు మాత్రమే ప్రజాప్రతినిధులు గుర్తుకొస్తారా అని ప్రశ్నించారు. విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసేటప్పుడు ప్రజా ప్రతినిధులు గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. కిట్ల పంపిణీకి ఎంపీపీని గానీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను ఎవ్వరినీ పిలవలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దారు సురేష్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో సి.బెళగల్, గుడికంబాలిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారని, ఇసుక కావాల్సిన వారు ఆధార్‌కార్డు ద్వారా బుక్ చేసుకోవచ్చని సూచించారు. ఇసుక తరలింపులో అక్రమాలకు పాల్పడితే రూ.2 లక్షలు జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

అనంతరం ఎమ్మెల్యే వై.బానాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మారితే ప్రజా ప్రతినిధులను మరచిపోతారా అని మండిపడ్డారు. వంట ఏజెన్సీని త్రిసభ్య కమిటీ అనుమతులు లేకుండా తొలగించడం మంచిదికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే వంట ఏజెన్సీలపై, ఇతర కాంట్రాక్ట్ కార్మికులపై దౌర్జన్యాలు మొదలయ్యాయని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, హామీల అమలుపై దృష్టి పెట్టాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఏదేమైనా అధికారులు ప్రొటోకాల్ పాటించాలని లేని పక్షంలో జిల్లా ఉన్నతాధికాలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఎంపీడీఓ జనార్దన్, వైస్ ఎంపీపీలు ఇర్ఫాన్ దేశాయి, ముత్తమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు షేర్‌ఖాన్‌పటేల్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలి



మొక్కలు నాటుతున్న ఫైర్ ఎస్‌ఐ రామాంజనేయులు, కౌన్సిలర్ నాగేశప్ప

ఎమ్మిగనూరురూరల్: మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఐ రామాంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని కలుగొట్ల గ్రామ సమీపంలోని శ్రీ పద్మావతి ఫ్యూయల్ కేంద్రంలో రిలయన్స్ జియో బీపీ ఫౌండేషన్ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, చెట్లను నరకడం వల్ల పర్యావరణం దెబ్బతింటోందని, కాలుష్యం పెరిగిపోయి ప్రజలు కొత్త వ్యాధుల భారిన పడి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ కామూర్తి నాగేశప్ప, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



శిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు చేతుల మీదుగా కన్నడ పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. తాలుకా డీఈఓ గురప్ప, ఎమ్మెల్యే నాగరాజు చేతుల మీదుగా ఆంధ్ర రాష్ట్ర గడి భాగాన ఉన్న కన్నడ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని కౌతాళం, ఆదోని, హాలహర్వి, హోళగుంద మండలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. కౌతాళం మండలంలోని 7,726 మంది విద్యార్థులకు సుమారు 2.18 లక్షల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కన్నడ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుని ఉచితంగా పుస్తకాలను అందిస్తోందని, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా మంచి చదువులు చదవాలని, అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. కన్నడ ఉపాధ్యాయులు హనుమంతప్ప, మూకప్ప, మల్లికార్జున, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అర్బన్: కర్నూలులోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను బుధవారం ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదోని నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఏపీ ఎన్జీఓస్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న సభ్యులు

ఆదోని రూరల్: పట్టణంలోని ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆదోని నియోజకవర్గ ఏపీ ఎన్జీఓస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో నియోజకవర్గ అధ్యక్షులుగా ఉషారాణి, కార్యదర్శిగా బజారి, సహాధ్యక్షులుగా లక్ష్మి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునతో పాటు మరికొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమిస్తామని తీర్మానం చేశారు.

గోశాలకు పశువుల తరలింపు



రోడ్లపై సంచరిస్తున్న పశువులను లారీలో ఆదోని గోశాలకు తరలిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలగజేస్తున్న పశువులను బుధవారం మున్సిపల్ అధికారులు లారీలో ఎక్కించి ఆదోనిలోని గోశాలకు తరలించారు. మొదటిరోజు 9 పశువులను గోశాలకు తరలించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పాడిరైతులు తమ పశువులను పట్టణంలోని రోడ్లపైకి వదిలితే పట్టుకుని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. పశువుల యజమానులకు గతంలో హెచ్చరికలు చేసినా నిర్లక్ష్యం వహిస్తూ పశువులను వీధుల్లోకి, రోడ్లపైకి వదలడంతో పట్టుకొని గోశాలకు పంపుతున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర గవర్నర్‌తో శ్రీమఠం పీఠాధిపతి భేటీ



మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బాయిస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం: శ్రీకృష్ణ చరిత్ర మంజరి పుస్తకావిష్కరణలో భాగంగా మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బాయిస్‌తో మంత్రాలయం శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు భేటీ అయ్యారు. బుధవారం ముంబాయి నగరంలో రాజ్‌భవన్‌కు చేరుకుని ఆ రాష్ట్ర గవర్నర్‌తో కలిసి పుస్తకావిష్కరణ గావించారు. రాఘవేంద్ర స్వామి రచించిన శ్రీకృష్ణ చరిత్ర మంజరి గ్రంథానికి శ్రీమఠం పండిత కేసరి గిరి ఆచార్య సంకలనం గావించారు. సంకలనం పుస్తకాన్ని పూణేకు చెందిన గురురాజ్ పులకర్ణి మరాఠి భాషలో అనువాదం చేశారు. సదరు పుస్తకాన్ని పీఠాధిపతి గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేయించారు. కార్యక్రమంలో రాజా అప్రమేయ ఆచార్య, రామకృష్ణ టేల్కర్, అక్షయ టేల్కర్, ప్రశాంత్ జోషి పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల ధర్నా



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న స్కీమ్ వర్కర్లు

కోసిగి: స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశావర్కర్లతో కలిసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, , ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ మురళికి అందజేశారు. ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెప్సిబా రాణి, వరలక్ష్మి, సుజాత, సుజాత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు కుట్ర



సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు

ఆదోని రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతోందని సీఐటీయూ పట్టణాధ్యక్షుడు తిప్పన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ ఆరోపించారు. ఆ మేరకు బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమ్మేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, డిఫెన్స్, రైల్వే ఇలా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరించడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్‌లను అమలు చేసే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రావిటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడాలన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి పీఎస్ గోపాల్, మండలాధ్యక్షులు రామాంజనేయులు, అంగన్‌వాడీ నాయకురాళ్లు వరలక్ష్మి, రిజ్వానా, సరోజ, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై సమీక్ష



మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణాభివృద్ధి, స్థానికంగా నెలకొన్న సమస్యలపై బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. జీడీపీ నుంచి పట్టణానికి ఏఐఐబీ స్కీం కింద చేపడుతున్న మంచినీటి పైప్‌లైన్ పనుల వివరాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ చంద్రమోహన్‌రావు, డీఈ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పట్టణంలో పశువులు, వీధికుక్కల బెడద నివారణ చర్యలు, అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి లైట్లపై మున్సిపల్ అధికారులకు సూచనలిచ్చారు. అదేవిధంగా మంచినీటి పైప్ లైన్లు, కనెక్షన్లు ఇవ్వడంపై ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈలు, ఏఈలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



పెద్దకడబూరు తహసీల్దారు సురేష్‌బాబుకు వినతి పత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెద్దకడబూరు: ఐసీడీఎస్‌ను బలోపేతం చేసి అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు తిక్కన్న, ఈరన్న డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోర్కెల దినోత్సవం పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు జీతాలు పెంచుతాం, ఐసీడీఎస్‌ను బలోపేతం చేస్తామని ఇచ్చిన హామీలు నీటిపై బుడగలాగా మారాయన్నారు. గత 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే దిశగానే అడుగులు వేస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ 3వ సారి అధికారంలోకి వచ్చిన తరువాత లేబర్ కోడ్‌లు అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సురేష్‌బాబుకు సమర్పించారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో తహసీల్దార్ విఫలం



పెద్దకడబూరులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు: మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో తహసీల్దారు సురేష్‌బాబు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం నాయకులు మబ్బు ఆంజనేయ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ప్రభుత్వ భూమి సమస్యను పరిష్కరించడంలో తహసీల్దార్ విఫలమయ్యారన్నారు. సర్వే నంబర్ 174/1లో భూ సమస్యను పలుమార్లు ఆయన దృష్టికి తీసుకెళ్లగా తాను డెప్యూటేషన్‌పై వచ్చానని చెబుతూ తప్పించుకుంటున్నాడని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు కార్యాలయానికి వెళ్తే నిర్లక్ష్యపు సమాధానాలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతులు సమస్యల పరిష్కారానికి ఎక్కడికి వెళ్లాలో చెప్పాలని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి మండలానికి రెగ్యూలర్ తహసీల్దారును నియమించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి సమర్పించారు. నాయకులు జాఫర్‌పటేల్, తిక్కన్న, సర్దార్‌జీపటేల్, జోలు హనుమంతు, నరసింహులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పంచాయతీ వేలాలు



గోనెగండ్లలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

గోనెగండ్ల: మేజర్ గ్రామ పంచాయతీ గోనెగండ్లకు సంబంధించి కమేళా, సంతమార్కెట్, బండిమెట్ట వ్యాపార హక్కులకు బుధవారం ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ హైమావతి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు ప్రశాంతంగా ముగిశాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో వేలంపాట జరగాల్సి ఉండగా ఎన్నికల కోడ్ నిమిత్తం మూడు నెలల పాటు వాయిదా పడ్డాయి. ఈ మేరకు జూలై 11 నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు వ్యాపార హక్కులకు వేలాలు నిర్వహించారు. ఈ వేలం పాటలో కమేళాను శేషాద్రినాయుడు రూ.56 వేలకు, సంతమార్కెట్‌ను రూ.33 వేలకు, బండిమెట్టను రూ.46 వేలకు బడేసా దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ నాగేష్ మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎవరైనా ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీ పరిధిలోని స్థలాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ సతీష్, మలాంగ్, సుభాన్, అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘం నాయకుడి మృతి



హనుమంతు (ఫైల్)



మృతుడి భార్య శారదకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక మైనార్టీ కాలనీ సమీపంలోని కాలువ రస్తాలో నివాసం ఉంటున్న దివ్యాంగుల సంఘం మండల ఉపాధ్యక్షుడు పూడూరు హనుమంతు (42) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు నాడుగేని నాగరాజు, దివ్యాంగుల సంఘం గౌరవాధ్యక్షుడు బసవరాజు, మండలాధ్యక్షుడు ఆరేకంటి తాయన్న, పెండేకంటి వెంకటేష్, గోపాల్, హనుమంతు, రాజేష్, అయ్యన్న తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. దివ్యాంగుల సంఘం తరపున చేయి చేయి కలిపి రూ.10 వేలు ఆర్థిక సాయంను మృతుడి భార్య శారదకు అందజేశారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రెండవ రోజూ పాఠశాలకు తాళం



కందనాతిలో పాఠశాలకు తాళం వేసిన ఎస్సీ కాలనీవాసులు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామం ఎస్సీ కాలనీలోని డిపెప్ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ బుధవారం రెండవ రోజు కాలనీవాసులు పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించే వరకు రోజూ తాళం వేస్తూనే ఉంటామని చెప్పారు. ఉపాధ్యాయులను నియమించాలని మండల విద్యాశాఖాధికారికి సంవత్సరం నుంచి చెబుతున్నా పట్టించుకోవడం లేదని, రెండు రోజులుగా పాఠశాల వద్ద నిరసనలు తెలుపుతున్నా ఎంఈఓ స్పందించకపోవడం దారుణమన్నారు. ఒక్క ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చి పిల్లలకు ఏమి చదువు చెబుతారని, పిల్లలను అదుపు చేయడానికే సమయం సరిపోతుందన్నారు. జిల్లా కలెక్టర్, డీఈఓ, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని, లేని పక్షంలో తాళం వేసి విద్యార్థులతో పాటు ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం

కౌతాళం: వైఎస్సార్‌సీపీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం 3 గంటలకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- 19 వేలు నగదు, 6 మోటర్ సైకిళ్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం

కౌతాళం: మండల పరిధిలో అందర్–బహార్ పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కామవరం – పెద్దతుంబళం గ్రామాల మధ్యన రిజర్వ్ ఫారెస్టులో కొందరు డబ్బులు పెట్టి అందర్ బహార్ పేకాట ఆడుతున్నట్లు తెలియడంతో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రూ.19,170 నగదు, 8 సెల్‌ఫోన్లు, 6 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు కుప్పగల్‌కు చెందిన మల్లికార్జున, తిమ్మారెడ్డి, తలారి తిరుమలతో పాటు పెద్దతుంబళంకు చెందిన కాసీమయ్యా, మక్బూల్‌బాషా, అబ్దుల్లాను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అంతేకాక గ్యాంబ్లింగ్ నిర్వహించిన కుప్పగల్‌కు చెందిన బసవరాజ్, గణేష్, తిమ్మప్ప, పారిపోయిన పెద్దతుంబళం, కుప్పగల్‌కు చెందిన సూరపురాజు, హాజీ, లాలు, పామయ్యగారి వెంకటేష్, పంజారి నబి, బదినేహాల్ శీను, గుడికల్ శీను, వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మైనింగ్ ప్రాంతం పరిశీలన

ఆదోని రూరల్: మండలంలోని మండిగిరిలోని మైనింగ్ ప్రాంతాన్ని బుధవారం ఆదోని తహసీల్దార్ హసీనాసుల్తానా పరిశీలించారు. మండిగిరి గ్రామంలోని సర్వేనంబర్ 586లో 2.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలానికి గ్రావెల్ అవసరం ఉండగా వాటి కోసం ఎంసీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి, డిస్ట్రిక్ మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా క్షేత్రగస్థాయిలో మండిగిరి ప్రాంతంలోని సర్వేనంబర్ 586 ప్రాంతాన్ని తనిఖీ చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈమె వెంట మండల సర్వేయర్ రమణ, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హసీనాసుల్తానా